పసుపు రైతుల మెరుపుధర్నా

పసుపు పంటకు మద్దతు ధర చెల్లించాలని నిజామాబాద్‌లో రైతులు సోమవారం మెరుపుధర్నాకు దిగారు. ముందుగా మార్కెట్ యార్డు కార్యాలయాన్ని ముట్టడించారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి బస్టాండ్ ఎదుట బైఠాయించారు. పసుపుబోర్డు పేరుతో కేంద్రం తమను దగా చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తమను మోసం చేసిందని మండిపడ్డారు. రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడ్డారని తెలిపారు. మార్కెట్ యార్డుకు పసుపు తీసుకొచ్చి వారం రోజులు గడుస్తున్నా కొనడంలేదని పసుపు రైతులు వాపోయారు. అధికారులు, వ్యాపారులు కుమ్మక్కై తమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. - కంఠేశ్వర్

నీళ్లిచ్చే చేతగాక నోటికొచ్చిన మాటలు

- ఎండిపోతున్న వరిని చూసి సీఎం రేవంత్‌పై రైతు ఆగ్రహం

సూర్యాపేట, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : 'నాకున్న ఏడెకరాల్లో 4 ఎకరాలు ఎండిపోగా పక్కనే ఉన్న మూడెకరాలు బోర్లతో కాపాడుకుంటున్నా. అసలు ముఖ్యమంత్రి పదవిలో ఉన్న ఆయనకు ఏమన్నా మైండ్ పనిచేస్తున్నదా? నీళ్లు లేక ఎండిన 4 ఎకరాలు.. దాని పక్కనే మరో మూడెకరాలు అనుకునేఉన్నయి. సూర్యుడేమైనా మా దుష్మనా.. పగబట్టి 4 ఎకరాలను ఎండబెట్టిండా? ఇంతకంటే పెద్ద జోకు మరొటి ఉంటదా?' అని ఎండిపోతున్న వరిపొలాన్ని చూస్తూ కడుపుకాలిన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రానికి చెందిన రైతు జాన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశాడు. 'వ్యవసాయం అంటే ఏంటో రేవంత్‌కు తెలియదు.. డబ్బులు సంపాదించేందుకు రాజకీయాల్లోకి వచ్చినట్టుంది.. ఏదన్న మాట్లాడితే ఆలోచించి మాట్లాడాలి.. కేసీఆర్ నీళ్లు తెచ్చి ఇస్తే ఆరేడేండ్లు బాగా పంటలు పండించుకున్నం.. రేవంత్ వచ్చి నీళ్లు ఆపేసిండు. మనిషికి చిన్న రోగం వస్తే వెంటనే దవాఖానకు పోతం.. మరి కేసీఆర్ అంతపెద్ద కాళేశ్వరం కడితే చిన్న మరమ్మతు చేయించి నీళ్లివ్వాలనే బుద్ధి పుడతలేదా ? నీళ్లిచ్చే చేతకాకనే అలాంటి మాటలు మాట్లాడుతున్నడు.. రైతుబంధు ఇయ్యలేదు. 90 క్వింటాళ్ల సన్న ధాన్యానికి ఇప్పటికీ బోనస్ పడలేదు. రుణమాఫీ కాలేదు.. నీకు ఓట్లేసి గెలిపించినందుకు చెంపలేసుకుంటున్నం' అని మండిపడ్డాడు. 'ఏదో కేసులో రేవంత్ దొరికిండట కదా.. ఆ కేసులో జైలుకు పోయినా బాగుండేది.. వేరే ముఖ్యమంత్రి వస్తే.. మాకు నీళ్లు వచ్చేవేమో' అని పేర్కొన్నాడు.

రోజుకు 8 ట్యాంకర్ల నీళ్లు

రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం అడవి పదిరకు చెందిన యువరైతు బైరి సాయి చిరంజీవి రెండెకరాల 30 గుంటల్లో వరి పంట వేశాడు. మరో పది రోజుల్లో పంట చేతికొస్తుందనుకున్న సమయంలో రెండు బోర్లు ఎత్తేశాయి. దీంతో మూడు రోజులుగా సమీప చెరువులోంచి రోజుకు రూ.వెయ్యికి ఒక ట్యాంకర్ చొప్పున 8 ట్యాంకర్ల నీళ్లు పెడుతున్నాడు. అయినప్పటికీ ఎకరం పొలం ఎండిపోయేటట్టు ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. 'సేసెతానికి ఇక్కడ పనిలేక మా నాన్న నెల కిందట దుబాయ్ పోయిండు.. నేను కూడా ఇగ దుబాయ్‌కు పోవాల్సి వస్తదేమో..' అని యువరైతు బైరి సాయి చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశాడు. - ఎల్లారెడ్డిపేట

నేడు పసుపు రైతు 'చలో మెట్‌పల్లి'

- రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహార్యాలీ
- మూడు జిల్లాల నుంచి తరలిరానున్న రైతులు

మెట్‌పల్లి, మార్చి 10: రోజు రోజుకూ పతనమవుతున్న పసుపు ధరలతో రైతులు ఆందోళన బాట పడుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పలుకుతున్న ధరలతో పంట పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పసుపు రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో అన్నదాతలు 'నేడు చలో మెట్‌పల్లి' కార్యక్రమానికి పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో ఉదయం 10 గంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి జాతీయ రహదారి మీదుగా పాత బస్టాండ్ వరకు ఐక్య వేదిక నాయకులు, అన్నదాతలు మహార్యాలీ తలపెట్టారు.

రెండు నెలల్లో ఆరు బోర్లు..

నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కాస్‌బాగ్‌తండాలో రైతు అఖిలేశ్ 6 ఎకరాల్లో వరి సాగుచేశాడు. చెరువులు ఎండిపోయి బోర్లు బిక్కడంతో పంట ఎండిపోతున్నది. దీంతో పంటను కాపాడేందుకు సదరు రైతు రెండు నెలల్లో ఆరు బోర్లు వేయించాడు. ఒక్కో బోరు వెయ్యి ఫీట్లకు పైగా వేసినా నీటి జాడ కనిపించలేదని ఆవేదన వ్యక్తంచేశాడు. కొద్దిపాటి నీరైనా వస్తుందనే ఆశతో కుటుంబసభ్యులతో కలిసి బోరులో మోటర్ దింపినా ఫలితం దక్కలేదని వాపోయాడు. ఇదే మండలంలోని గుడితండాలో నగేశ్ అనే రైతు తన పొలం ఎండిపోవడంతో పొలాన్ని మేకల మేత కోసం వదిలేశాడు. – ఖలీల్‌వాడి

రోడ్డెక్కిన పాడి రైతులు

పెండింగ్ పాల బిల్లులు ఇవ్వాలని డిమాండ్.. హైదరాబాద్-శ్రీశైలం హైవేపై రాస్తారోకో

వెల్దండ, మార్చి 10: పాడి రైతులు కన్నెర్ర చేశారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన పాడి రైతులు సోమవారం హైదరాబాద్–శ్రీశైలం హైవేపైకి చేరుకొని రాస్తారోకో చేపట్టారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. రాత్రింబవళ్లు కష్టపడి, అప్పులు తెచ్చి పశుగ్రాసం కొనుగోలు చేసి, విజయ డెయిరీకి పాలు పోస్తే నెలల తరబడి బిల్లులు చెల్లించకుంటే ఎలా బతకాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే పాడి రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే బిల్లులు విడుదల చేయాలని, లేకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. పాల బిల్లులు కూడా తగ్గించి ఇచ్చారంటూ పలువురు పాడి రైతులు ఆందోళనకు దిగారు. ఊర్కొండ మండలం ఊర్కొండపేట, బొమ్మరాజుపల్లి, ఇప్పపహాడ్‌లో పాలసేకరణ కేంద్రాల వద్ద పాలక్యాన్లతో పాడి రైతులు నిరసన తెలిపారు. మంగళవారం కల్వకుర్తిలో నిర్వహించనున్న పాడిరైతుల ర్యాలీకి ప్రతి గ్రామం నుంచి రైతులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

మరో ఇద్దరు రైతుల ఆత్మహత్య

మహేశ్, మోటె నర్సింహ (ఫైల్)

మూసాపేట/రామన్నపేట, మార్చి 10: అప్పుల బాధ భరించలేక ఇద్దరు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లాలో యువ రైతు, భువనగిరి జిల్లాలో కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం మహ్మద్‌హుస్సేన్‌పల్లికి చెందిన పూల మహేశ్(39) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తన పొలంలో మొక్కజొన్న, వరి, పల్లి సాగు చేశాడు. దిగుబడి రాకపోవడంతో రూ.30 లక్షల వరకు అప్పులయ్యాయి. వడ్డీ, అసలు కట్టే మార్గం కనిపించక మనస్తాపంతో ఆదివారం పురుగుల మందు తాగాడు. హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. మహేశ్‌కు భార్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వేణు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురానికి చెందిన మోటె నర్సింహ(50) 14ఎకరాల భూమి కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పెట్టుబడి కోసం అప్పు చేశాడు. నీళ్లందక ఐదెకరాల పొలం ఎండిపోయింది. అప్పులు కట్టలేనని ఐదురోజుల నుంచి మనస్తాపం చెందుతున్నాడు. సోమవారం ఉదయం పొలం వద్ద పురుగుల మందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకున్నాడు. 108లో రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. నర్సింహకు భార్య, ఇద్దరు కూతుర్లున్నారు. భార్య కళమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

పంట ఎండుతున్నా పట్టదా?

ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు సాగు నీరందక రైతులు ఆగమవుతున్నారని, పొలాలు ఎండుతున్నా కాంగ్రెస్ సర్కారుకు పట్టదా? అని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రశ్నించారు. సోమవారం కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తిలో ఎండిపోయిన పంటపొలాలను ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడారు. సాగు నీరందక కండ్లముందే పంటలు ఎండిపోతున్నా పట్టించుకునేవారే లేరని, రైతుల పరిస్థితి అరణ్య రోదనగా మారిందని దుయ్యబట్టారు. రూ.20 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. - గంగాధర

వారంలోపు దేవాదుల నీళ్లివ్వాలి: జాన్‌వెస్లీ

జనగామ చౌరస్తా, మార్చి 10: కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పంటలు ఎండుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. సోమవారం జనగామ జిల్లాలోని చిన్నరాంచర్ల, గానుగుపహాడ్, వడ్లకొండలో ఎండిన పంటలను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వారంలోగా దేవాదుల నీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో దేవాదుల ద్వారా చెరువులు నింపి రైతులకు సాగు నీళ్లు అందించి పంటలు ఎండిపోకుండా కాపాడిందని గుర్తుచేశారు.

సాగునీటి కోసం విస్సంపల్లి రైతుల నిరసన

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం నుంచి ఎస్సారెస్పీ కాల్వ ద్వారా వస్తున్న నీటికి బాల్యతండా రైతులు అడ్డుకట్ట వేసి తమ గ్రామానికి నీరు రాకుండా చేస్తున్నారని చిన్నగూడూరు మండలం విస్సంపల్లి రైతులు ఆరోపించారు. దీంతో విస్సంపల్లి, తుమ్మలచెరువులో వరి పొలాలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. విషయం తెలుసుకున్న ఇరిగేషన్ డీఈ రాజ్‌కుమార్ ఎస్సారెస్పీ కాల్వ పరిశీలనకు వచ్చారని, ఆయనకు సమస్యను వివరిస్తున్న క్రమంలో బాల్యతండా రైతులు అక్కడికి వచ్చి వాగ్వాదానికి దిగినట్టు తెలిపారు. దీంతో సమస్యను పరిష్కరించకుండానే అధికారి వెళ్లిపోయారని, ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించాలని విస్సంపల్లి రైతులు డిమాండ్ చేశారు. - చిన్నగూడూరు

రేవంత్‌కు ఎద్దు.. ఎవుసం తెలియదు

పంటలు ఎండి రైతులు గోస పడుతున్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎద్దు.. ఎవుసం తెలియదని నల్లగొండ డీసీసీబీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శివలాల్ తండాలో ఎండిన పంటను సోమవారం ఆయన పరిశీలించారు. గిరిజన మహిళా రైతులు ధరావత్ నీలమ్మ, పద్మమ్మ, ధరణిమ్మ, బాలమ్మ నీళ్లు లేక తమ పంటలు ఎండిపోయాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో వ్యవసాయం బాగుందని చెప్పారు. - ఆలేరు టౌన్

పెరిగిన భానుడి ప్రతాపం

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 9గంటల నుంచే భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. మరో ఐదురోజులపాటు ఎండలు మరింత పెరిగే అవకాశం ఉన్నదని వాతావరణశాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం అత్యధికంగా వనపర్తి జిల్లా కొత్తకోటలో 39.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వెల్లడించారు. బయటకు వెళ్తే జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

రైతుల దీక్షకు రసమయి మద్దతు

సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో రైతులు వారం రోజులుగా చేస్తున్న దీక్షకు మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ సంఘీభావం తెలియజేశారు. సోమవారం ఆయన దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాలకు చెందిన ఆరు గ్రామాల రైతులు దీక్షలో కూర్చున్నారు. రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. సాగునీరు విడుదల చేసే వరకూ రైతులకు బీఆర్ఎస్ మద్దతుగా ఉంటుందని హామీ ఇచ్చారు. అన్నపూర్ణ, రాజరాజేశ్వర ప్రాజెక్టుల్లో నిండు కుండలా నీళ్లున్నా మండలంలోని పంటలు ఎందుకు ఎండుతున్నాయని ప్రశ్నించారు. ఎమ్మెల్యే నిర్లక్ష్యంతోనే నీళ్లు రావడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, సెస్ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహారెడ్డి పాల్గొన్నారు. - ఇల్లంతకుంట

విద్యుదాఘాతంతో రైతు మృతి

పెద్దకొత్తపల్లి, మార్చి 10 : పంటకు సాగునీరు పారించేందుకు వెళ్లిన రైతు కరెంట్ షాక్ తగిలి మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటు చేసుకున్నది. రైతు బంధువులు, స్థానికుల కథనం మేరకు.. పెద్దకొత్తపల్లి మండలం పాత యాపట్లకు చెందిన రైతు బక్కయ్యగౌడ్ (60)కు మూడున్నర ఎకరాల పొలం ఉన్నది. యాసంగిలో వేరుశనగ సాగు చేశాడు. పంటకు నీరందించేందుకు ఆదివారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ బోరు మోటర్ ఆన్ చేసే క్రమంలో విద్యుత్తు స్టార్టర్ వద్ద కట్ అయిన వైర్ తగిలి చనిపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సతీశ్ తెలిపారు.

ఎస్సారెస్పీ కాల్వకు గండి

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మోదులగూడెం సమీపంలోని రేగులకుంట లోకి నీటిని తరలించేందుకు ఆదివారం రాత్రి తండాకు చెందిన గుర్తుతెలియని వ్యక్తులు ఎస్సారెస్పీ కాల్వకు గండి పెట్టారు. దీంతో వరద బయటకు ఒక్కసారిగా రావడంతో 10ఎకరాల మామిడి తోట, వరి పొలానికి నష్టం వాటిల్లింది. అధికారులు గండి పడిన ఎస్సారెస్పీ కాల్వను పూడ్చకపోవడంతో నీరంతా వృథాగా పోతున్నది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు గండిని పూడ్చాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేశారు. -కురవి

రామప్ప సరస్సు ఒగరు కాల్వకు బుంగ

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలోని రామప్ప సరస్సు ప్రధాన కాల్వ ఒగరు కాల్వకు ఆదివారం రాత్రి బుంగ పడి నీరు వృథాగా పోతున్నది. దీంతో సమీపంలోని పంటపొలాలు నీటిలో మునిగాయి. సోమవారం విషయం తెలుసుకున్న నీటి పారుదల శాఖ అధికారులు డీఈ రవీందర్, ఈఈ నారాయణ, ఏఈ జయంతి పరిశీలించి తూములకు నీటి సరఫరా నిలిపివేశారు. త్వరలో మరమ్మతు చేసి పంటపొలాలకు నీరు అందిస్తామని తెలిపారు. - వెంకటాపూర్

నీరందక ఎండుతున్న పొలాలు

హనుమకొండ జిల్లా వేలేరు పెద్దచెరువు తూము నుంచి సాగు నీరందక పంట పొలాలు ఎండుతున్నాయని వేలేరు మండలం ఎర్రబెల్లి, బండతండా, ధర్మసాగర్ మండలం ముప్పారం, నారాయణగిరి రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వేలేరు పెద్దచెరువు తూము నుంచి ప్రతియేటా సాగునీరందించే వారని, ఈ ఏడాది ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయలేదని చెబుతున్నారు. దీనిపై అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. - వేలేరు/ధర్మసాగర్

వడ్ల బోనస్ ఇవ్వండి

- జోగుళాంబ గద్వాల కలెక్టరేట్ ఎదుట రైతుల నిరసన

గద్వాల, మార్చి 10: కొనుగోలు చేసిన వడ్లకు బోనస్ డబ్బులివ్వాలని రైతులు డిమాండ్ చేశారు. సోమవారం గద్వాల కలెక్టరేట్ గేటు ఎదుట బీఆర్ఎస్‌వీ జిల్లా కో–ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య ఆధ్వర్యంలో అయిజ మండలం బైనపల్లికి చెందిన 50 మంది రైతులు ఆందోళనకు దిగారు. ధాన్యం కొని మూడు నెలలైనా ప్రభుత్వం బోనస్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుభరోసా రాక, బోనస్ డబ్బు అందక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కేసీఆర్ పాలనలో రైతుల కండ్లల్లో ఆనందం ఉండేదని, కాంగ్రెస్ వచ్చాక కన్నీళ్లు వస్తున్నాయని చెప్పారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.